క్లుప్తంగా

క్షయ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం కృషి


వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారిణి

ముస్తాబాద్: క్షయ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బత్తుల గీతాంజలి అన్నారు. ముస్తాబాద్ మండలం గూడెం పల్లె బస్తీ దవాఖానలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధికి ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన మందులను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాధి వచ్చిన వారికి ఆరు నెలల కోర్సుతో ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ శివాంజలీ, టెక్నికల్ స్టాఫ్ మహిపాల్, ఏఎన్ఎమ్ భాగ్యలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మాజీ సర్పంచుల నిరాహార దీక్ష


సంఘీబావం తెలుపుతున్న సత్యనారాయణ

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని చేపడుతున్న నిరహార దీక్ష నాల్గో రోజుకు చేరుకుంది. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ దీక్షకు మద్దుతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించిన మాజీ సర్పంచుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. దీక్షలో మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం సభ్యులు బొడ్డు దేవయ్య, బుర్ర మల్లేశం, భూపతి రెడ్డి, పిట్టల వెంకటేశం పాల్గొన్నారు.

న్యాక్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


ట్రైనింగ్ సామగ్రి అందజేస్తున్న సెస్ డైరెక్టర్

ముస్తాబాద్: నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన న్యాక్ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్ శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన న్యాక్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మంత్రి కేటీఆర్ మండల కేంద్రంలో న్యాక్ ద్వారా టైలరింగ్, మేషన్, ప్లంబర్, వెల్డర్, సర్వేయర్ తదితర వృత్తి విద్య, నైపుణ్య కోర్సులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేసి, ఉపాధి కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో అందరికి ఉచిత భోజన వసతి కల్పిస్తారన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సర్పంచ్ సుమతి, న్యాక్ ఇన్‌చార్జి గోలి ప్రకాశ్, చిగురు నరేశ్, మట్టరాణి, భాగ్య, కుర్ర సావిత్రి, స్వర్ణ, నవీన్, బిక్షపతి పాల్గొన్నారు.

పేదల కల సాకారం

వేములవాడఅర్బన్: 30 ఏళ్లుగా గుడారాల్లో దుర్భర జీవనం సాగిస్తున్న పేదవారి కలను ప్రభుత్వం సాకారం చేసింది. రోజంతా పనికిపోతే తప్ప పూట గడవదు. మంది ఇళ్లను చూసి, తమకు కూడా ఇళ్లు గిట్ల ఉంటే మంచిగుండు అనుకునుడే తప్ప, కట్టుకునే స్తోమత లేదు. తాము కూడా ఇళ్లు కట్టుకోవాలని ఉన్నా వారి దగ్గర అంత డబ్బు లేవని నిత్యం బాధపడుతున్న కోతుల వారికి ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వడంతో వారి సంతోషానికి అవధులు లేవు.

- నిరుపేదలకు డబుల్ ఇళ్లు అందజేత
- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- నిరుపేదల కళ్లల్లో ఆనందం


చింతల్‌ఠాణాలో డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీ

వేములవాడ మండలం రుద్రవరం పాత గ్రామానికి చెందిన కోతుల కాలనీవాసులు 30 ఏళ్ల క్రితం వచ్చి రుద్రవరంలో పంట చేలల్లో గుడారాలు వేసుకుని కోతుల ఆటలు ఆడుతూ జీవనం గడుపుతుండేవారు. అక్కడి రైతులు తమ చేల నుంచి వెళ్లాలి అని అనడంతో ఎక్కడికి వెళ్లాలో తెలియని అయోమయపరిస్థితుల్లో, అప్పటి ప్రజాప్రతినిధులు దగ్గరలో ఉన్న మూడెకరాల ప్రభుత్వ భూమిలో వీరికి పట్టాలు అందించింది. దీంతో అక్కడే గుడారాలు వేసుకుని కాలం వెల్లదీస్తున్నారు.

మిడ్ మానేరు ప్రాజెక్ట్ పూర్తికావడంతో బ్యాక్ వాటర్ రుద్రవరం వరకు రావడంతో కోతుల కాలనీవాసులు ఇక్కడి నుంచి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాని కోతుల కాలనీవాసులకు పునరావాసం కల్పించలేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబును వీరు కలిసి, తమ పరిస్థితిని విన్నవించడంతో చింతల్‌ఠాణా గ్రామశివారులో వీరికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించడమే తరువాయి, ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. దీంతో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పక్కన ఖాళీ స్థలంలో గుడారాలు వేసుకుని ఉన్నారు.

మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం

వేములవాడ మండలం చింతల్‌ఠాణా గ్రామ శివారులోని కోతుల కాలనీవాసులకు రూ. 2.20 కోట్లతో 41 డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించారు. వాటిని మంగళవారం ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చేతుల మీదుగా ప్రారంభించడంతో పాటు ఇళ్ల పట్టాలను వెంటనే వారికి అందజేశారు.


పట్టా అందిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

మిగిలిన వారికి కూడా అందించండి

మంత్రి కేటీఆర్ డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభించిన అనంతరం అర్హులైన మిగిలిన ఇంక 22 మంది కోతుల వారి కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందించాలని వేడుకుంటూ జాబితాను మంత్రి కేటీఆర్‌కు అందించారు. మంత్రి స్పందించి కలెక్టర్‌కు ఆ లిస్టును అందించి వీటిని పరిశీలించాలని తెలపడంతో వారికి కూడా త్వరలో ఇళ్లు మంజూరు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చాలా సంతోషంగా ఉంది



చింతల్‌ఠాణా గ్రామ శివారులో ప్రభుత్వం మాకు ఇళ్లు కట్టించి ఇవ్వడం సంతోషంగా ఉంది. నల్లా, విద్యుత్ దీపాలను కూడా ఏర్పాటు చేశారు.

– కమల, చింతల్‌ఠాణా

గుడారాల్లోనే బతికినం



ఇన్నాళ్లు ఎండ, వాన, చలికి ఓర్చుకుని గుడారాల్లోనే బతికినాం. ఇప్పటికైనా ప్రభుత్వం మమ్ములను గుర్తించి ఇళ్లు కట్టించి ఇవ్వడంతో సంతోషంగా ఉంది.

– సమ్మక్క, చింతల్‌ఠాణా

మా కల నెరవేరింది



మాకు ఇళ్లు కట్టుకునే స్తోమత లేదు. రోజువారీ పనిచేసుకుని పొట్టపోసుకునేటోళ్లం. ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇచ్చి మా కలను నిజం చేసింది. సంతోషంగా ఉంది.

– రాములు, చింతల్‌ఠాణా

సమాచారం

అవర్లీ బేస్డ్ టీచర్ల పోస్టుకు నోటిఫికేషన్ విడుదల

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్‌లో పీజీటీ మ్యాథమెటిక్స్ పోస్టు భర్తీ చేసేందుకు అవర్లీ బెస్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథమెటిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తు, సంబంధిత ధ్రువీకరణపత్రాల జిరాక్స్‌ను ఈ నెల15 లోగా పాఠశాలలో సమర్పించాలని, ఈనెల 17న ఉదయం ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామన్నారు.

గురుకుల పాఠశాలలో సీట్ల కోసం..

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ క్యాటగిరీలలో మిగిలిన సీట్ల భర్తీ కోసం కళాశాలకు రావాల్సిందిగా ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, తమ ఒరిజినల్ ధ్రువీకరణపత్రాలతో ఈనెల 14లోగా పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

వాహన తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై ఆంజనేయులు

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కోనరావుపేట: రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే రమేశ్ బాబు అన్నారు. మండలంలోని ధర్మారంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అనేక రకాలుగా సర్వే చేసిందని అన్ని సర్వేల్లోనూ బీఆర్ఎస్ పార్టీ ముందుందన్నారు. గృహలక్ష్మి, మైనార్టీ బంధు ఎంపిక పారదర్శకంగా చేపట్టడం జరుగుతుందన్నారు. గృహలక్ష్మి ఇల్లు మరో వెయ్యి పెంచాలని సీఎంను కోరామన్నారు. రానున్న 3 వారాల్లో గ్రామాల్లో బూత్ కమిటీలు పూర్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెక్స్‌టైల్ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కుమార్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్‌చైర్మన్ తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సర్పంచ్‌ల ఫోరం కన్వీనర్ గోపు పర్శయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, కాశవేణి మహేశ్, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి


పరామర్శిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా వుంటుందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. కొండాపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్త బంటు మైసయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అండగా వుంటామని కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు గంత రాజు, కరుణాకర్, రాజు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశం, పద్మారెడ్డి, రామచంద్రం, భరత్, వినయ్, రాజం పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్స్‌కు రూ.9.98 లక్షలు మంజూరు

సిరిసిల్ల: పట్టణంలోని నెహ్రూనగర్‌లో రజక కమ్యూనిటీ హాల్‌కు రూ.4.99 లక్షలు, దోభీ గల్లీలో మరో కమ్యూనిటీ హాల్‌కు రూ.4.99 చొప్పున లక్షలు మంజూరయ్యాయని రజక సంఘం పట్టణ అధ్యక్షుడు దండు శ్రీనివాస్ తెలిపారు. వీటిని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ద్వారా మంజూరు చేయించారని ఆయన వివరించారు. సిరిసిల్ల పట్టణ రజక సంఘానికి నిధులు మంజూరు చేయించిన రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్‌కు దండు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

'విద్యాభివృద్ధికి ప్రాధాన్యత'

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంపీపీ వేణుగోపాల్, జెడ్పీటీసీ ఉమ, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ సుధాకర్, వైస్‌ఎంపీపీ నాగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య పాల్గొన్నారు.

సంక్షేమం ప్రతి ఇంటికి చేరింది


ఉత్తర్వులు అందిస్తున్న జిందం కళ, చక్రపాణి

సిరిసిల్లటౌన్: ఆదర్శవంతమైన బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని 11, 26, 34 వార్డుల్లో నూతనంగా బూత్ కమిటీలు నియమించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతుంటుందన్నారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలతో మమేకమై ఉంటూ వారి సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, కేడీసీసీబీ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, దిడ్డి శ్రీనివాస్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదల ఉంటే అన్నీ సాధ్యమే


స్వాతిని సత్కరిస్తున్న ఏనుగు మనోహర్‌రెడ్డి

వేములవాడ: పట్టుదల, కృషి ఉంటే సాధించలేనిదంటూ ఏమీ ఉండదని నేటి యువతరానికి ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి సూచించారు. ఇటీవల ఎస్సైగా ఎంపికైన కొప్పుల స్వాతిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం శ్రమిస్తూ ఎస్సైగా ఎంపికై వేములవాడ గౌరవాన్ని పెంచారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శేఖర్, ఫాక్స్ చైర్మన్ కిషన్ రెడ్డి, సర్పంచ్ అంజిబాబు నాయకులు ఉన్నారు.


ఎస్‌ఐ అభ్యర్థి కార్తీక్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎస్‌ఐ అభ్యర్థికి సత్కారం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల గ్రామంలో ఏఆర్ ఎస్సైగా ఎంపికయిన మొగిలి కార్తీక్‌ని గ్రామస్తులు అభినందించారు. గ్రామ యువకులు, బీజేపీ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎగుర్ల అనిల్, మేకల శ్రీనివాస్, ఎడ్ల కిషన్, గడ్డం సతీష్, మేకల వెంకటేశ్, మంద పవన్, ముదాం వంశీ, ఎగుర్ల ప్రశాంత్ ఉన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన సంఘాల నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్ తహసీల్దార్ గణేశ్‌ను అంబేద్కర్ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు కాంపెల్లి శ్రీనివాస్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిగారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తిరుపతి, మాజీసర్పంచ్ గాడిచర్ల దేవయ్య, మత్స్య సహకార సంఘం డైరెక్టర్ శ్రీనివాస్, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఇసుక, మట్టి మాఫియాను అరికట్టాలి

బోయినపల్లి: మండలంలో ఇసుక, మట్టి మాఫియాలను అరికట్టాలని మండల సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం నూతన తహసీల్దార్ పుష్పలతను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో సహజ వనరుల అక్రమ రవాణాను అరికట్టాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మండల సీపీఎం కన్వీనర్ గురజాల శ్రీధర్, రామంచ అశోక్, ఎలిగేటి రాజశేఖర్ ఉన్నారు.

దివ్యాంగ చిన్నారులకు ఉచిత ఫిజియోథెరపి సేవలు


చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్

ముస్తాబాద్: దివ్యాంగులైన చిన్నారులకు ఉచిత ఫిజియోథెరపి సేవలను మండల వనరుల కేంద్రంలో అందస్తున్నట్లు ఎంఈవో బన్నాజీ అన్నారు. ముస్తాబాద్ ఎమ్మార్సీలో దివ్యాంగులైన చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రతినెల నుంచి దివ్యాంగులైన చిన్నారులకు ఉచితంగా సేవలందిస్తున్నామన్నారు. మండలంలో దివ్యాంగులను గుర్తించామని, ప్రతి శుక్రవారం నిర్వహించే శిబిరానికి తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకువచ్చి, సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ రాజేశ్, ఐఈఆర్‌పీ గౌతమి, ఉద్యోగులు శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మ రాజేందర్, సాయి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం


నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ

ఎల్లారెడ్డిపేట: గ్రామ కమిటీలతో పార్టీని బలోపేతం చేయాలనే లక్ష్యంతో నూతనంగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లో శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల వరకు బూత్‌స్థాయి నుంచి మండల స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా సోనవేణి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా హుస్సేన్, కార్యదర్శిగా సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా వుచ్చిడి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా రాజయ్య, సలహాదారుడిగా నాగరాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, దేవయ్య, బాబు, బుచ్చాగౌడ్, సురేశ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో పశువులకు వ్యాపిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణకు శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించి టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారిణి రేణుక తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పడిగెల రవీందర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని తడగొండ, మల్కాపూర్ గ్రామాల్లో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిబిరం నిర్వహించారు. శిబిరంలో 270 పశువులకు టీకాలు వేసినట్లు బోయినపల్లి పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు చిందం రమేశ్, కోరెపు నరేశ్, ఏఎంసీ డైరెక్టర్ గుడి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అశోక్ కుమార్, సిబ్బంది నరేందర్, మధుమిత, శ్రీవాణి, గోపాలమిత్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

- పద్మశాలీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోనె ఎల్లప్ప

సిరిసిల్లఅర్బన్: రాజకీయాల కోసం పద్మశాలీలపై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని పద్మశాలీ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోనె ఎలప్ప అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 17 నియోజకవర్గాలలో పద్మశాలీలకు టిక్కెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓ ప్రజాప్రతినిధి పద్మశాలీలు ఓట్లు వేస్తేనే గెలిచానా.? అని మాట్లాడడం తమను కించపరచడమేనన్నారు. తమ ఓట్లతో గెలవనప్పుడు ఈ ప్రాంతంలో పోటీ చేయడం ఎందుకని ప్రశ్నించారు? పద్మశాలీల ఓట్లు అధికంగా ఉన్న ఈ సిరిసిల్ల నియోజకవర్గంలో తమకు సీటు కేటాయించేందుకు ఎందుకు ముందుకు రావడం లేదన్నారు. సిరిసిల్లలో ఆత్మహత్యలు జరుగుతున్న 2007లో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా తాను, అన్ని రాజకీయ పార్టీలు, కులసంఘాల సహకారంతో పద్మశాలీల అభ్యున్నతి కొరకు రూ.51 లక్షల నిధిని సేకరించి కమిటీ ఆధ్వర్యంలో ఉంచామని, మరి పద్మశాలీల అభ్యున్నతికి మంత్రి కేటీఆర్ రూ.5 కోట్లు, ఐదెకరాల స్థలాన్ని కేటాయించారని చెప్పుకుంటున్నారని, వాటిని ఎవరి చేతుల్లో పెట్టారని, ఏ కమిటీ నియమించారని, అసలు వారు పద్మశాలీలేనా అని ప్రశ్నించారు. రాబోవు రోజుల్లో పద్మశాలీలందరిని ఏకం చేసి, పద్మశాలీలకు సీట్లు కేటాయించిన వారి పార్టీలకే మద్దతు తెలుపుతామన్నారు. లేనిపక్షంలో స్వతంత్రంగానైనా బరిలో నిలుస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో విద్యార్థులకు ఆర్టీసీ అధికారులు శుక్రవారం ఉచిత బస్సు పాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు శీర్ల లక్ష్మణ్, జలంధర్, రామారాజు మాట్లాడుతూ ఆర్టీసీ పాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విహార యాత్రలకు వెళ్లేందుకు బస్సుల్ని ముందుగా బుక్ చేసుకుంటే 10 నుంచి 20 శాతం వరకు రాయితీ అవకాశం ఉంటుందన్నారు. సర్పంచ్ సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం మురళీధర్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

వీర్నపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో పార్టిసిపేటరీ రూరల్ అప్రైసల్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్న విద్యార్థులు గ్రామ రైతులకు వివిధ అంశాలపైన అవగాహన కల్పించారు. గ్రామ మ్యాపుతోపాటు, సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పంట పొలాలు, చిత్రపటాన్ని చూపిస్తూ వివరించారు. సమస్యల చెట్టు అనే చిత్రపటం ద్వారా రైతులు చేస్తున్న తప్పిదాలను వివరించారు. సర్పంచ్ దానకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఏఈవో శ్రీధర్‌రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా శిబిరం

వీర్నపల్లి: మండలం కేంద్రం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పాటి దినాకర్ అధ్వర్యంలో శుక్రవారం ప్రమాద బీమా శిబిరంలో ఇండియా పోస్ట్ పేమెంట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇండియా పోస్ట్ పేమెంట్ సిరిసిల్ల బ్యాంక్ మేనేజర్ రాజేందర్, వీర్నపల్లి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ లద్దురి మల్లేశ్, యాకోబ్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ప్రజాసేవతో గుర్తింపు తెచ్చుకోవాలి

తంగళ్లపల్లి: నూతనంగా రెగ్యులర్ అయిన పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ అయిన 12 మంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీడీవో లచ్చాలు ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వరతండాలో శుక్రవారం సర్పంచ్ ఆజ్మీరా రజిత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో 8మంది లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పంపిణీ చేశారు.

పాఠశాలకు ప్రొజెక్టర్ వితరణ

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని మర్రిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వేములవాడ పట్టణానికి చెందిన వ్యాపారీ ఏగిన శాంతను ప్రొజెక్టర్, లాప్‌టాప్ అందజేశారు.

నిరుపేదను ఆదుకోండి

వేములవాడరూరల్: ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో నష్టపోయిన శాత్రాజుపల్లికి చెందిన పాశం ప్రశాంత్‌కుమార్‌ను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుచ్చిబాబు, ప్రవీణ్ కోరారు.

ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలి

చందుర్తి: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడేను తప్పకుండా పాటించాలని ఎంపీడీవో పత్తి రవీందర్ కోరారు. మండలంలోని మూడపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన డ్రై డేను ఎంపీడీవోతో పాటు ఎంపీవో ప్రదీప్‌కుమార్ పరిశీలించారు. సర్పంచ్ అంజిబాబు, పాల్గొన్నారు.

ఆర్థికసాయం

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లికి చెందిన గుడిసె నరేశ్‌కు మై హోం ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పంద్రాగస్టుకు సిద్ధం



తంగళ్లపల్లి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట జాతీయ పతాకాన్ని ఎగురవేసేందుకు అశోక చిహ్నంతో కూడిన జెండా గద్దెను నిర్మిస్తున్నారు. నాలుగు సింహాల బొమ్మలతో ఏర్పాటు చేస్తున్న ఈ చిహ్నం కార్యాలయానికి వచ్చే వారిని ఆకర్షిస్తోంది. అశోక చిహ్నం ఏర్పాటుతో ఎంపీడీవో కార్యాలయం కొత్త అందం సంతరించుకోనుంది.